జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం 13 అక్టోబర్ 2026 పేజీలు : 8



## తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు

# ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- బతుకమ్మ వేడుకల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలి
- బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు, మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకం అమలులో అవినీతికి తావులేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చాలి



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి బతుకమ్మ వేడుకలు, ఇందిరమ్మ మహిళా డెయిరీ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి 2011లో తాను బతుకమ్మ పండుగ గురించి పెద్దగా వినలేదని, నేడు - మిగతా2లో

## ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో టేకు కలప మాయం!

- అక్రమంగా నరికిన కలప ఎక్కడ..?
- అధికారులకు తెలియకుండానే తరలించారా..?
- రూ.2 లక్షల విలువైన కలపపై అనుమానాలు.. అధికారుల వివరణపై అసంతృప్తి



6

## రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణా

# ఆపేదెవరు?

- నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లతో తోలుతున్న వైనం
- అనుభవము లేని డ్రైవర్లు అధిక వేగం
- చీకటి మాటున యధేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా
- అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట లేనట్టేనా..?
- అధికారులపై మండిపడుతున్న మండల ప్రజలు




5



## ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

- వైభవంగా కలెక్టరేట్ లో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు
- కలెక్టరేట్ లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్

6

# తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

-మొదటిపేజీ తరువాయి

ఈ పండుగ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను వైభవంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. అందరినీ భాగస్వాములను చేస్తూ, పండుగ కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అన్ని మండలాల అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, స్థానిక సంస్థల అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పారిశుధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటు, తదితర అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతి మండలం నుంచి కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.మహిళల ఆరోగ్యం, కౌమారదశలో బాలికలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించే అంశాలను బతుకమ్మ కార్యక్రమాల్లో భాగంగా చేర్చాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ మహిళా డెయిరీ కార్యక్రమంపై సమీక్షిస్తూలి మొదటి విడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని, రెండు రోజుల్లోగా పశువుల కొనుగోలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పథకం అమలులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. చిన్నపాటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని



తెలిపారు.పశువులు పొందే లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్‌తో కూడిన పశువుల షెడ్డు ఉండేలా చూడాలని, యూనిట్‌కు అయ్యే మొత్తం వ్యయం, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, లబ్ధిదారుడు సమకూర్చు కోవాల్సిన వాటా, తదితర వివరాలతో సమగ్ర ప్యాకేజీ రూపొందించాలని సూచించారు.మండలాల జనాభా ఆధారంగా క్లస్టర్లను గుర్తించి, ప్రతి క్లస్టర్‌కు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు.ఒక్కో స్వయం సహాయక సంఘానికి పశు గ్రాసం ఉత్పత్తి,మరో సంఘానికి పాల సేకరణ,శుద్ధి వంటి బాధ్యతలను అప్పగించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఒక క్లస్టర్‌లో 500 పశువులు ఉంటే, వాటికి ఏడాది పొడవునా అవసరమయ్యే పశుగ్రాసం పరిమాణాన్ని ముందుగానే అంచనా వేయాలని తెలిపారు.ఎండు గడ్డి, పచ్చి పశు గ్రాసం,మిశ్రమ పశుగ్రాసం తయారీ,తదితర సదుపాయాలను సమగ్ర ప్యాకేజీలో భాగంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 10 నుంచి 18వ తేదీ వరకు శాఖల వారీగా బతుకమ్మ కార్యక్రమాల రోజువారీ షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తూ, అక్టోబర్ 18న పెవిలియన్ గ్రౌండ్స్‌లో పెద్ద ఎత్తున సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రధాన కూడళ్లలో పూల బతుకమ్మలను ఏర్పాటు చేయాలని, ట్యాంక్ బండ్లు, చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను గ్రామ పంచాయతీలు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో చేపట్టాలని తెలిపారు.ట్రాఫిక్ ఐలాండ్లను అందంగా అలంకరించి బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేయాలని, ఏరియా ఆసుపత్రులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో బతుకమ్మ వేడుకల వాతావరణం కల్పించాలని సూచించారు. ఆడపిల్ల జన్మించిన సందర్భాల్లో మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించడం ద్వారా బాలికల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని తెలిపారు. ఆసుపత్రుల ప్రసూతి వార్డుల్లోనూ బతుకమ్మ సంబరాలు నిర్వహించాలన్నారు.మున్సిపల్ కమీషనర్లు పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో బతుకమ్మ ఇతి వృత్తంతో విద్యుద్దీపాలంకరణలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ బతుకమ్మ పండుగ ప్రత్యేకతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలు,బాలికలు, చిన్నారులను భాగస్వాములను చేస్తూ క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలల సంరక్షణ గృహాలు, వృద్ధాశ్రమాలను సందర్శించి అక్కడి వారిని కూడా బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములను చేయాలన్నారు. బతుకమ్మ కార్యక్రమాల సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకులు పారా కోటేశ్వరరావు మృతి

## నివాళులర్పించిన సిపిఐ నాయకులు





బోనకల్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి): సిపిఐ సీనియర్ నాయకులు, ఆళ్లపాడు మాజీ సర్పంచ్ పారా సుబ్బయ్య తనయులు పారా కోటేశ్వరరావు (63) అనారోగ్యంతో సోమవారం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని ఆళ్లపాడు లోని ఆయన స్వగృహంలో సిపిఐ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనంద్ రావు ,జిల్లా సమితి సభ్యులు రోషన్ కుమార్ నాయకులు, బొమ్మినేని కొండలరావు, వేలూరి పూర్ణచంద్రరావు ,మాతంగి శ్రీనివాసరావు, బొమ్మినేని ప్రభాకర్ రావు ,గ్రామ సిపిఐ కార్యదర్శి బెజవాడ నరేష్ బుంగ నరసింహ తదితరులు నివాళులర్పించారు.

## క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి

## రూ.. 50వేలు వైద్య సహాయం

**సత్తుపల్లి అక్టోబర్12(ప్రజా జ్యోతి)** పట్టణానికి చెందిన కొరకొప్పు చార్లెస్ ఫిన్నీ, 12సం తండ్రి జానకి రాముడు (పెయింటర్), ద్వారకాపురి కాలనీ సత్తుపల్లి. అరుదైన బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ ప్రాణాలతో పోరాడుతూ తమిళనాడు సీఎం సి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. బాబు ట్రీట్మెంట్ కోసం సోషల్ మీడియా ద్వారా అందరి సహాయ సహకారాలతో రూ:- 50వేలు డబ్బులు యువ భారత శక్తి సభ్యుల ద్వారా ఏర్పాటు చేశారు. ఆ మొత్తం ఫండింగ్ ఫౌండేషన్ ముఖ్య సభ్యులు స్వయంగా ఇంటికి వెళ్లి చార్లెస్ నానమ్మ కి అందించినారు. చిన్నారి వైద్యానికి ఈ విధంగా సహకారం అందించిన సభ్యులందరికీ యువభారత శక్తి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ముఖ్య సభ్యులు మరియు చార్లెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

## ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు.. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుష్ఠువ్యాధికి ఉచిత చికిత్స

## ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్ఠ వ్యాధి గుర్తింపు కార్యక్రమం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి,సకాలంలో చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కుష్ఠ వ్యాధి నిర్మూలనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.జిల్లా ప్రజలకు కుష్ఠ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందస్తుగా గుర్తించి, చికిత్స అందించేందుకు ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్ఠ వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి, ప్రజలకు కుష్ఠ వ్యాధిపై అవగాహన కల్పిస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత వైద్యాధికారులకు సూచిస్తారని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందించబడుతుందని తెలిపారు.కుష్ఠువ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఇది ప్రధానంగా చర్మం, నరాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి




సగటున మూడు సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు.చర్మంపై సహజ చర్మరంగు కంటే తక్కువ రంగులో లేదా ఎరుపు,రాగి రంగులో మచ్చలు కనిపించడం, ఆయా మచ్చల వద్ద స్పర్శజ్ఞానం తగ్గడం లేదా లేకపోవడం కుష్ఠువ్యాధి ముఖ్య లక్షణాలని తెలిపారు. శరీరంలోని ఏ భాగంలోనైనా ఇటువంటి మచ్చలు కనిపించవచ్చని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.కుష్ఠువ్యాధి ఎవరికైనా రావచ్చని, దీనికి వయస్సు, లింగభేదం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది వంశపారంపర్య వ్యాధి కాదని, శాపం లేదా పాపం వల్ల వచ్చే వ్యాధి కాదని స్పష్టం చేశారు. కుష్ఠువ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని,వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని గౌరవంగా చూడాలని కోరారు.కుష్ఠువ్యాధికి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) ద్వారా సాధారణంగా 6 నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి,వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.అవసరమైన సందర్భాల్లో వైద్యుల సలహా మేరకు శస్త్ర చికిత్స ద్వారా అంగవైకల్య సంబంధిత సమస్యలను సరిచేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.కుష్ఠువ్యాధికి సంబంధించిన చికిత్స అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. చర్మంపై స్పర్శజ్ఞానం తగ్గిన మచ్చలు కనిపించినప్పుడు సమీప ఆరోగ్య కార్యకర్తను లేదా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.కుష్ఠువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ చోరీపై నేడు ఇండియా కూటమి ఆందోళనలో భాగంగా ఏ ఐ సి సి,

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** టి పి సి సి పిలుపు మేరకు ఛలో డిల్లీ ప్రజాస్వామ్యం కోసం మార్చ్ పేరిట కనాట్ ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీలో పాల్గొనేందుకు ఇతర ముఖ్య నాయకులతో కలిసి డిల్లీ వెళ్లిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఏ ఐ సి సి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, లోక్ సభ ప్రతి పక్షనేత రాహుల్ గాంధీ ఆదేశాలమేరకు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




మల్లు గార్ల పిలుపు మేరకు డిల్లీ లో ర్యాలీ లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి చేపట్టిన ఉద్యమం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, దేశ పౌరుల ప్రాథమిక ఓటు హక్కును ,ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి అని,రాష్ట్రపతి తో పాటు వివిధ రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్ళిన అనంతరం న్యాయస్థానాల పరిధిలోని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇండియా కూటమి ఆధ్వర్యంలో శాంతియుత గాంధేయ మార్గంలో ఈ సత్యాగ్రహాన్ని నిర్వహిస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగవిలువను కాపాడుకొనేందుకు దేశ ప్రజలు అందరూ ఈ పోరాటానికి మద్దతు తెలపాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులు,శాసనసభ సభ్యులు,శాసనమండలి సభ్యులు,తెలంగాణ రాష్ట్ర ముఖ్య నాయకులు, రాష్ట్ర కార్పొరేషన్ ప్రస్తుత, మాజీ చైర్మన్లు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయి కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షయవ్యాధి (టీబీ) బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యాధి నుంచి కోలుకునేందుకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చికిత్స మధ్యలో నిలిపివేయకుండా పూర్తికాలం కొనసాగించాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, టీబీ ఆసుపత్రి ఇన్‌చార్జి, జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డా. నివేదిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

**కామేపల్లి మండలంలోని పాత లింగాల గ్రామంలో కీ. శే. రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి గారి నివాసంలో**



**కామేపల్లి ప్రజా జ్యోతి అక్టోబర్ 12** కామేపల్లి మండలం లోని పాత లింగాల గ్రామంలో కీర్తిశేషులు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి గారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచితపట్టబద్దుల ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ప్రతి గ్రాడ్యుయేటు తమ ఓటును నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉంది అందుకోసం ఈరోజు నుండి ఉచితంగా రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి గారి నివాసంలో ఉచితంగా శీఅశ్రీఅఅవ , ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. కావున కామేపల్లి మండలంలోని పట్టబద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నాము.

,, ఓటరుగా నమోదుకు అర్హతలు.

. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లమా పూర్తి చేసి ఉండాలి.

. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలో నివాసం అయి ఉండాలి.

. నమోదు తేదీలు:

ప్రారంభం, సెప్టెంబర్ 28

. చివరి తేదీ: నవంబర్ 6

తీసుకు రావలసిన వివరాలు/పత్రాలు;

1. పుట్టిన తేదీ
2. డిగ్రీ పొసైన సంవత్సరం
3. ఆధార్ కార్డు నెంబర్
4. ఓటర్ కార్డు నెంబర్
5. పాస్ పోర్ట్ సైజు ఫోటో
6. డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్
7. ఫోన్ నెంబర్
8. ఈమెయిల్ ఐడి
9. పూర్తి చిరునామా (ఇంటి నెంబర్ తో సహా)

సంప్రదించవలసిన నెంబర్లు

ఎస్. సతీష్ 9966366320

ఏ .మోహన్ 9573880695 జి రమేష్ 81794188956

# ఓట్ చోరీ ఆరోపణలకు ఆధారాలు చూపాలి: గుత్తా వెంకటేశ్వరరావు

## రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సవాల్



**రఘునాధపాలెం : ప్రజా జ్యోతి** ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపించాలని బీజేపీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో లోపాలు ఉంటే ఆధారాలతో ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దాలని సూచించారు. ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు చేయడం కాకుండా, వాటిని నిరూపించే ఆధారాలను సమర్పించి చట్టబద్ధమైన విచారణకు సిద్ధపడాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేయడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై విమర్శలు చేసే ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి నిర్మాణాత్మక పరిష్కారాలు సూచించాలని అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించడం ప్రజాస్వామ్య బాధ్యత అని తెలిపారు. ఓట్ చోరీ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచి ఎన్నికల సంఘానికి సమర్పించాలని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నేతలకు సవాల్ విసిరారు. ప్రజలకు రాజకీయ ఆరోపణల కంటే అభివృద్ధి, ప్రజాసేవ ముఖ్యమని గుత్తా వెంకటేశ్వరరావు తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

# కారేపల్లి లో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు.

**కారేపల్లి, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి :** ఆడపిల్లల స్వేచ్ఛ, సమానత్వం, మహిళల భద్రత కోసం మహిళలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి పిలుపునిచ్చారు. సోమవారం మాణిక్యారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించే పండుగ అని పేర్కొన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. చదవనిద్దాం.. పెరగనిద్దాం అనే నినాదంతో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని, మహిళల రక్షణకు ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం కాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాల తో పాటు చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం గ్రామ కూడలిలో రంగురంగుల




పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలు ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతర్ల సునీత, అజ్మీర జ్యోతి, బుసరాజు నాగమణి, మేకల స్వరూప, గడ్డిబోయిన సుభద్ర, వేపాకుల సుగుణమ్మ, సాయమ్మ, వీరమ్మ, పద్మ, రమ్య, సింధు, భవాని, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘ కాలపు ఆదాయాన్నిచ్చే పంట ఆయిల్ ఫామ్ : ముదిగొండ శ్రావణి.

**కారేపల్లి, అక్టోబర్ 12, ప్రజాజ్యోతి:** సింగరేణి మండలంలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైతు సూరపరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సోమవారం ఉద్యానవన శాఖ ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ముదిగొండ శ్రావణి సందర్శించారు. తోటలో ఆయిల్‌పామ్ మొక్కల పెరుగుదల, సాగు విధానం, నీటి వసతి,పంట నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుకు పంట అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యానవన శాఖ ద్వారా అందించే సహాయంపై సాగుదారులకు వివరించారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలను అందిస్తోందన్నారు. ఒక్కో మొక్క ధర రూ.193 ఉండగా రాయితీ ద్వారా రైతులకు రూ.20కే అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ రాయితీలతో రైతులపై ప్రారంభ పెట్టుబడి భారం తగ్గే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు తమ భూమి వివరాలు, నీటి వసతి, అర్హతలకు సంబంధించిన సమాచారంతో ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం అందించే సబ్సిడీకి సంబంధించి రైతుల వర్గం, భూమి విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారన్నారు.ఎస్సీ, ఎస్టీ రైతులకు 10 శాతం, బీసీ రైతులకు 20 శాతం,ఇతర కేటగిరీలకు చెందిన అర్హులైన రైతులకు 5 ఎకరాలకు పైగా భూమి ఉన్న సందర్భాల్లో 70 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఆర్థిక సహాయం కూడా అందిస్తుందని, పంట సాగు చేసిన రైతులకు ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సహాయం పొందేందుకు అవసరమైన అర్హతలు, చెల్లింపు విధానం గురించి రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కొత్తగా ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తు చేసుకునే రైతులకు సంబంధించి కొన్ని పరిమితులు, ప్రత్యేక నిబంధనలు వర్తించే అంశంపై స్పష్టత కోసం రైతులు సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.



# ప్రజల అవసరాలే తీర్చడమే మా లక్ష్యం

**గ్రామంలో 5 మినీ మంచినీటి ట్యాంకులు ప్రారంభం**

**ప్రజల తాగునీటి సమస్యలపై బోనకల్ గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి**

**బోనకల్‌లో ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 12 మినీ వాటర్ ట్యాంకులు నిర్మాణం**

**ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమే గ్రామపంచాయతీ లక్ష్యం**

**ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి మరింత అభివృద్ధి చేస్తాం**

**బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**




**బోనకల్, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి) :**
గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గుర్తించి, వారికి మెరుగైన మంచినీటి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా బోనకల్ గ్రామపంచాయతీ ముందుకు సాగుతోందనీ బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి కొండ మాట్లాడుతూ... గ్రామంలో మంచినీటి కొరతను తగ్గించేందుకు ఎస్ ఎస్ సంస్థ సహకారంతో మొత్తం 12 మినీ మంచినీటి ట్యాంకులను నిర్మిస్తుండగా, అందులో భాగంగా సోమవారం ఒకే రోజు 5 మినీ మంచినీటి ట్యాంకులను ప్రారంభం చేయడం జరిగింద న్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాంతాల్లో మినీ ట్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు. గ్రామంలోని వివిధ కాలనీలు, దేవాలయాల పరిసరాలు, రైతులకు అవసరమైన ప్రాంతాలు, స్మశానవాటిక సమీపంలో ప్రజలకు ఉపయోగపడేలా ఈ మినీ ట్యాంకులను ఏర్పాటు చేయడం విశేషం. ఒకేరోజు ఐదు మినీ ట్యాంకులు ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం గ్రామాభివృద్ధిలో కీలకమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కార దిశగా..**

గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి కొరత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఒక మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ ట్యాంకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలోని ప్రజలకు అందుబాటులో మంచినీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేయడం అభినందనీయమని కాలనీవాసులు అన్నారు.

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో గ్రామంలో సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది అన్నారు. దానికోసం గ్రామపంచాయతీ పాలకవర్గం అవిశ్రాంతంగా పనిచేస్తుందన్నారు.

ముత్యాలమ్మ, తిరుపతమ్మ అమ్మవార్ల ఆలయాల వద్దకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఒక మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆలయాలకి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనీ అన్నారు.

ప్రజల ఆధ్యాత్మిక అవసరాలతో పాటు ప్రాథమిక సౌకర్యాలకు కూడా ప్రాధాన్యతనిస్తూ ఈ ట్యాంకును ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా



గ్రామంలో శివాలయం సెంటర్ వీధిలో మరో మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ప్రజలు రోజువారీ అవసరాల కోసం మంచినీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఇలాంటి సదుపాయాలు ఎంతో అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలోని గ్రామ ప్రజలకు అందుబాటులో నీటి సౌకర్యాలు కల్పించడం ద్వారా మెరుగైన వసతులు అందించేందుకు గ్రామపంచాయతీ చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొంటున్నారు. మంచినీళ్ల బాయి సమీపంలో రైతుల అవసరాల కోసం మరో మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. పొలాలకు వెళ్లి రైతులకు , ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఈ మినీ వాటర్ ట్యాంక్ ఎంతో ఉపయోగం అన్నారు. గ్రామ ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే కాకుండా, గ్రామ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రైతుల అవసరాలను కూడా గుర్తించడం గ్రామపంచాయతీ లక్ష్యం అన్నారు. గ్రామ స్మశానవాటిక సమీపంలో తాగునీటి అవసరాలతో పాటు అంత్యక్రియలకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు స్నానాలు చేసుకునేందుకు వీలుగా మరో మినీ ట్యాంకును ఏర్పాటు చేశారు. సాధారణంగా అంత్యక్రియల సమయంలో అక్కడికి వచ్చే ప్రజలు నీటి సౌకర్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటాయి. కానీ ఇప్పుడు అలాంటి సమస్య ఉండదని తెలిపారు. గ్రామంలో మంచినీటి కొరతను తగ్గించేందుకు ఎస్ ఎస్ చారిటబుల్ సంస్థ సహకారంతో మొత్తం 12 మినీ మంచినీటి ట్యాంకులను నిర్మిస్తున్నామని సర్పంచ్ బానోతు జ్యోతి కొండ తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఐదు ట్యాంకులను ప్రారంభించామని, ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సమస్యలను పరిష్కరించడమే గ్రామపంచాయతీ బాధ్యత అని ఆమె అన్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే ప్రాంతాల్లో నీటి సదుపాయాలు కల్పించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టినప్పుడే స్థానిక పాలనపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తాగునీరు ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మినీ ట్యాంకులు ఏర్పాటు చేయడం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమంగా నిలుస్తోంది. మిగిలిన మినీ ట్యాంకుల నిర్మాణం కూడా పూర్తయి అందుబాటులోకి వస్తే గ్రామంలో మంచినీటి సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

అనంతరం ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ మహబూబ్ పాషాలి మాట్లాడుతూ... బోనకల్ మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చొరవ తీసుకుని, తమ సొంత ఆర్థిక సహకారంతో కూడా ఈ నిర్మాణంలో భాగస్వామ్యమైన సర్పంచ్, ఉప సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ సేవా దృక్పథం అభినందనీయం అని స్థానికులు అన్నారు. ప్రజా సేవలో వారికి ఉన్న అంకితభావానికి ఇది నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బోనకల్ పంచాయతీలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాము" అని తెలిపారు. ఈ ఐదు మినీ మంచినీటి ట్యాంకులను బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి , ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రామపంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి, ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ మహబూబ్ పాషా ప్రారంభించారు. మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సహకరించిన సంస్థకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో... గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు.. యార్లగడ్డ కుమారి, మరీదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మీరా సాహెబ్, జరుపుల లావణ్య, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, గ్రామ పెద్దలు.. సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, బొమ్మ కంటి రంగారావు, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నాగేశ్వరరావు, నందమూరి సత్యనారాయణ, తేలూరి రమేష్ , యార్లగడ్డ శ్రీను, గంగుల పుల్లయ్య, మోర్ల శ్రీను, యార్లగడ్డ రమేష్, చిట్టూరి శ్రీనివాస ప్రసాద్, మోర్ల ఆంజనేయులు, బండి వెంకటేశ్వర్లు, ఒరుగు నరసింహారావు, టైగర్ విజయ్, గద్దె రామారావు మరియు పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

